# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-12-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

2. వ్యవసాయంలో రైతులకు దిగుబడి ఆదాయం పెరిగేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషిచేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు.

3. ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ అవసరాలకు తగినట్లుగా విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

4. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం విధానం ద్వారా వైద్య రంగం మరింత బలోపేతం కానుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

5. భారత్ పాకిస్థాన్‌పై సాధించిన ఘన విజయానికి గుర్తుగా విజయ్ దివస్‌ను ఈరోజు జరుపుకుంటున్నాం.

==========================

ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన "అమరజీవి పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినం" కార్యక్రమంలో నిన్న సాయంత్రం ముఖ్యమంత్రి పాల్గొని పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులను సత్కరించారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ, వచ్చే ఏడాది మార్చి 16 వరకూ పొట్టి శ్రీరాములు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భావితరాలకు గుర్తుండేలా పొట్టిశ్రీరాములు స్మృతి వనాన్ని అమరావతిలో నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్..25 సెకన్లు

--------------------------

వ్యవసాయంలో రైతులకు దిగుబడి ఆదాయం పెరిగేలా వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషిచేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య గవర్నరును కలిసి వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రగతి నివేదికను నిన్న అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఆవిష్కరణలు, పరిశోధనలు, ప్రయోగ ఫలితాలు క్షేత్రస్థాయిలో రైతులకు

అందుబాటులోకి రావాలని సూచించారు. వాతావరణ మార్పులు, మార్కెట్ ధరలు, ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టాలు ఎదుర్కొంటున్న సమస్యలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిష్కారం చూపాలని కోరారు. అధిక ఉష్ణోగ్రతలు, భారీ వర్షాలు, కరవు, చీడ పీడలను ఎదుర్కొనే విత్తన రకాలను ఆవిష్కరించాలని గవర్నర్ సూచించారు.

---------------------------

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆంధ్రప్రదేశ్ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ నిన్న సమావేశం అయ్యారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వివరించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కనీస సామర్థ్యాలైన పఠన, గణన నైపుణ్యాలు సాధించేందుకు గ్యారంటీడ్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు క్లిక్కర్ ఆధారిత ఇంటరాక్టివ్ క్లాస్ రూమ్ రెస్పాన్స్ సిస్టమ్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలలు స్వయంగా నిర్వహించే సెంట్రల్ స్మార్ట్ కిచెన్ ను కడపలో ప్రారంభించామని మంత్రి లోకేష్ వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో త్వరలో జరగనున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా, విద్యార్థులను సమాయత్తం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో తీసుకుంటున్న చర్యలపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి దృశ్య మాధ్యమం విధానంలో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఫలితాలతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థుల సంరక్షణపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత వసతి గృహాల సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు తాజా, వేడి ఆహారం మాత్రమే అందించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు.

---------------------------

ప్రతి మహిళా ఆర్థిక సాధికారత సాధించాలన్నదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–డీఆర్డీఏ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ –సెర్ప్ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజార్ –2025ను స్థానిక శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబుతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రతి జిల్లాలో 5 కోట్ల రూపాయలతో క్లస్టర్ విధానం తీసుకొస్తామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు సరస్ వంటి వాణిజ్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్ అవసరాలకు తగినట్లుగా విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, పాలకొల్లు నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 250

కోట్ల రూపాయలతో విద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నామని చెప్పారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం –పీపీపీ విధానం ద్వారా వైద్య రంగం మరింత బలోపేతం కానుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రభుత్వం తీసుకువస్తున్న పీపీపీ మోడల్ ద్వారా వైద్య కళాశాలల నిర్మాణం కేవలం 2 సంవత్సరాల్లో పూర్తవుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంపై కొంతమంది అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఇది సరికాదని అన్నారు. పీపీపీ విధానం ద్వారా మొత్తం మెడికల్ సీట్లు 500 నుంచి 2000కి పెరుగుతాయని, ప్రత్యేకంగా పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం 850 సీట్లు కేటాయింపుగా ఉంటాయని చెప్పారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

విజయ్ దివస్ ను ఈరోజు జరుపుకుంటున్నాం. 1971లో 13 రోజుల పాటు జరిగిన యుద్ధంలో భారత్ పాకిస్థాన్‌పై సాధించిన ఘన విజయానికి గుర్తుగా ప్రతి ఏటా డిసెంబర్ 16వ తేదీని విజయ్ దివస్‌గా నిర్వహించుకుంటున్నాం. 93 వేల మంది పాకిస్తాన్ సైనికులు భారత సైన్యానికి లొంగిపోవడంతో పాటు నూతన బంగ్లాదేశ్ అవతరణకు ఆ యుద్ధం దారి తీసింది. బంగ్లాదేశ్ ఏర్పాటు కోసం భారత్ పాకిస్థాన్‌పై జరిపిన యుద్ధంలో అమరులైన భారత వీరులను స్మరించుకుంటూ జాతి యావత్తూ వారికి నివాళులు అర్పిస్తోంది.

---------------------------

రైతులు ఇంటి నుంచే ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకొనేలా చర్యల తీసుకుంటున్నామని తెలంగాణా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నామని చెప్పారు. యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులపై అధ్యయనం చేసిన వ్యవసాయశాఖ ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించిందన్నారు. రైతు తన పంటలకు అవసరమైన పరిమాణాన్ని, తనకు అనుకూలమైన ఏ డీలరు వద్ద నైనా ముందుగా నమోదు చేసుకుంటే దాని ఆధారంగా ఏరోజు యూరియా సరఫరా చేస్తారో తెలుస్తుందని ఆ రోజు డీలరు వద్దకు రైతు వెళ్లి కొనుగోలు చేయవచ్చని తెలిపారు. రైతులకు సమయం ఆదాతో పాటు యూరియా, ఇతర ఎరువుల పంపిణీని సరళతరం చేయడానికి ఈ విధానం తీసుకొచ్చామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలితీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు రానున్న మూడురోజుల్లో 2 నుంచి 4 డిగ్రీలు తగ్గే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లిలో కనిష్ఠ ఉష్ణోగ్రత 7.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

అలాగే తెలంగాణాలోని కొమరంభీం అసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్‌లో 7.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

======================